క్లుప్తంగా

అంబులెన్స్ తనిఖీ



పరికరాలను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ హెడ్ బాగిష్ మిశ్రా

పటాన్‌చెరు టౌన్: పశుసంవర్ధక శాఖ అంబులెన్స్ 1962ను ప్రాజెక్ట్ హెడ్ డాక్టర్ బగిష్ మిశ్రా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని పరికరాలు వాటి పనితీరు, మందులు, రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశుపోషకుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే సిబ్బంది తక్షణమే స్పందించి పశువులకు సేవలు అందించాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, ఎగ్జిక్యూటివ్ ఉషన్, అంబులెన్స్ సిబ్బంది పవన్, శివకుమార్ పాల్గొన్నారు.

అంబలితో ఆరోగ్యం



అంబలిని సేవిస్తున్న రోగుల సహాయకులు

నారాయణఖేడ్: జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి వద్ద అంబలిని పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ మశ్చందర్ సూచనతో ప్రతినిధులు పరశురాం రెడ్డి, శ్రీనివాస్‌సాగర్, తుకారాం రోగులతో పాటు వారి సహాయకులకు అంబలిని అందజేశారు. సామాజిక సేవలో భాగంగా సంచార అంబలి కేంద్రాల ద్వారా నియోజకవర్గంలోని సంతలు, పీహెచ్‌సీలు, ప్రధాన చౌరస్తాల్లో, బస్టాండ్ల వద్ద పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న అధికారులు

జోగిపేట(అందోల్): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఆర్డీఓ పాండు, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, తహసీల్దార్ విష్ణు సాగర్ లబ్ధిదారులకు అందజేశారు. 153 మందికి కల్యాణలక్ష్మి, 19 మందికి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. పేదింటి యువతలకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అక్సానిపల్లి పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివరాజ్, మాజీ సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ హరికృష్ణ గౌడ్, మాజీ డైరెక్టర్ అశోక్, నాయకులు పాల్గొన్నారు.

పుల్‌కల్‌లో..

పుల్‌కల్(అందోల్): తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. 66 మందికి పంపిణీ చేశామని తహసీల్దార్ క్రిష్ణ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



చెక్కుల పంపిణీ చేస్తున్న బుచ్చిరెడ్డి

సంగారెడ్డి: సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన చెక్కులను బీఆర్ఎస్ నేత బుచ్చిరెడ్డి మంగళవారం 42 మంది లబ్ధిదారులకు రూ.14.42 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో సంగారెడ్డి అభివృద్ధికి 75 కోట్లు నిధులు మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం 40 కోట్ల నిధులను రద్దు చేసి పట్టణ అభివృద్ధిని అడ్డుకుంటుందని మండిపడ్డారు. త్వరలో ఎమ్మెల్యే నాయకత్వంలో పెద్ద ఎత్తున నియోజకవర్గ సమస్యలపై ఉద్యమం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, మండలం పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ కిట్ల అందజేత



రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న బాధ్యులు

నారాయణఖేడ్: రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ఖేడ్‌లో మంగళవారం స్థానిక ముస్లిం యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 200 మంది నిరుపేద మహిళలకు రేషన్ కిట్లు అందజేశారు. నిరుపేదలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలనే కిట్లను పంపిణీ చేసినట్లు ముస్లిం యాక్షన్ కమిటీ బాధ్యులు తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- పట్టించుకోని అధికారులు

మున్సిపాలిటీలోని కేసీఆర్ నగర్‌లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. డబుల్ బెడ్ రూంల వద్ద ఎక్కడికక్కడ చెత్త పేరుకు పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. స్వయంగా కలెక్టర్ వల్లూరు కాంత్రి పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించినా పట్టించుకోనేవారు లేరని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన, ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయని కాలనీవాసులో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో చెత్తకుప్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం కేసీఆర్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్యం విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినా పట్టించుకోనే వారే కరువయ్యారు. నెల రోజుల క్రితం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి స్వయంగా కేసీఆర్‌నగర్ కాలనీవాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను హెచ్చరించారు. అయినప్పటికీ పారిశుద్ధ్యం అమల్లో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్‌లో ఏబ్లాక్ వద్దకు వెళ్లితే రోడ్డుపై చెత్తకుప్పలే దర్శనమిస్తాయి. తాగునీటి సంపుల పక్కనే పెద్ద ఎత్తున చెత్తను వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త కుప్పల కారణంగా దుర్వాసన, దోమలు బెడదతో ప్రజలు అనారోగ్యబారిన పడుతున్నారు. పారిశుద్ధ్యం విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిసరాలను పరిశుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సమస్య పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



నీటిసంపు వద్ద చెత్త

నారింజ ప్రాజెక్టు నీరు కలుషితం

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి) గ్రామశివారులోని నారింజ ప్రాజెక్టు నీరు కలుషితమవుతోందని. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులోకి కలుషిత నీరు వచ్చి చేరుతోందని, ఇది ఎక్కడి నుంచి వస్తున్నదనే విషయాన్ని అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. సమీపంలో ఉన్న ఓ పశువధశాల కర్మాగారం నుంచి వస్తోందా లేక జహీరాబాద్ పట్టణంలోని మురికి నీరు వచ్చి చేరుతోందా అనే విషయాలను సంబంధిత శాఖ అధికారులు తేల్చాలని పేర్కొన్నారు. ప్రాజెక్టులోని నీరంతా రంగు మారిందని, దీంతో పశువులు సైతం నీటిని తాగడం లేదని చెప్పారు. ప్రాజెక్టు కింద 300 ఎకరాల ఆయకట్టుకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నీటిని పరిశీలించి, కారకులపై చర్యలు చేపట్టాలని కోరారు.



ప్రాజెక్టు నీటిని పరిశీలిస్తున్న నరోత్తం

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

తహసీల్దార్ హరిచంద్రప్రసాద్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. సర్వేనంబర్ 30లో నిర్మించిన అక్రమ బేస్‌మెంట్‌లను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ తహసీల్దార్ హరిచంద్రప్రసాద్ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు.



నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై విచారణ

నారాయణఖేడ్: అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో 204 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. మంగళవారం గృహనిర్మాణ శాఖ ఏఈ సతీష్ తివారీ, సత్యనారాయణ పట్టణంలో పర్యటించి లబ్ధిదారులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారా.. ఇళ్లు నిర్మించుకోవడానికి సొంత స్థలాలు ఉన్నాయా లేవా అనే వివరాల సేకరించారు. మొదటి విడతలో అద్దె ఇళ్లల్లో ఉంటూ నిర్మించుకోవడానికి సొంత స్థలాలు ఉన్నవారికే ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌లను అందజేసి సహకరించాలని కోరారు.



ఇందిరమ్మ ఇళ్లపై వివరాలు సేకరిస్తున్న అధికారులు

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

సంగారెడ్డి టౌన్: న్యాయవాదులకు రక్షణ చట్టాలు తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది ఇజ్రాయిల్ దారుణహత్యను ఖండిస్తూ జిల్లా కోర్టులో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాది ఇజ్రాయిల్‌ను చంపిన హంతకుడిని కఠినంగా శిక్షించాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తమ న్యాయవాదుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రారెడ్డి



జోగిపేట(అందోల్): జోగిపేట బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి హరినారాయణ వర్మ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సార వెంకటేశంలు ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని అన్నారు.

మహిళల కీర్తిని చాటిన సునీతా విలియమ్స్

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా

పటాన్‌చెరు టౌన్: భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ మహిళల కీర్తిని చాటారని, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా అన్నారు. మంగళవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ సర్పంచ్ బాలమణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాటా సుధా హాజరై, కేక్‌కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళల సాధికారితకు విద్య, ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని, ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సంప్రదాయపరంగా చీర, గాజులు, బొట్టు మహిళల గొప్పతనానికి ప్రతీకలని, ఇవి ఆత్మగౌరవాన్ని పెంచే అంశాలని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న కాటా సుధా, మహిళలు

తాగునీటి కోసం బోర్లు ఏర్పాటు



బోరు పనులు ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో బోరు వేయడం జరిగిందని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పొల్కంపల్లి గ్రామంలో బోరు మోటార్ పనులు ప్రారంభించారు. తాగునీటి కొరత ఉన్న గ్రామాల్లో బోరు మోటార్ ద్వారా నీటి సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



వట్‌పల్లి: బోరు మోటారు బిగిస్తున్న సిబ్బంది

వట్‌పల్లి(అందోల్): మండలంలోని పల్వట్ల గ్రామంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఎస్‌డీఎస్ నిధులతో నూతనంగా బోరుబావులను తవ్వించి మంగళవారం మోటార్‌లు బిగించారు. వేసవిని దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా ఎస్సీ కాలనీలో బోర్లు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవీందర్‌కల్యాణ్, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, మాణిక్యం, మొగులయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

నారాయణఖేడ్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. నారాయణఖేడ్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రవేశాలకు ఎంపికయ్యారు. హన్మంత్‌రావుపేట్‌కు చెందిన అక్షర పాఠశాల విద్యార్థి శివచంద్, మణికంఠ, ఉదయ్‌కిరణ్, హరిప్రసాద్‌రెడ్డి ఎంపికయ్యారు.



బేగరి శివచంద్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సిద్ధార్థ పాఠశాల విద్యార్థి సాయిరిత్విక్ నవోదయకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.శేఖర్‌రెడ్డి తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతుల ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. నవోదయకు ఎంపికైన సాయి రిత్విక్‌ను మంగళవారం ప్రిన్సిపాల్, డైరెక్టర్ మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.



సాయి రిత్విక్

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి జోన్: జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, ఆయన కుమారుడు క్రాంతి, సోదరులు బాలయ్యపై హత్యాయత్నం చేసిన వెంకట మురళీకృష్ణపై పీడీయాక్ట్ కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే రిమాండ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్, అంబేడ్కర్ యువ సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బుల దుర్గాప్రసాద్, రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బీరయ్య యాదవ్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, దళిత నాయకులు చిత్తరి అనంతయ్య, మల్లేశం, పోతురాజు పవన్, జెల్ల సురేష్ బాధితుడు పల్లె సంజీవయ్య ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు

మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ వీఎస్ రాం

న్యాల్‌కల్(జహీరాబాద్): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధించాలని మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ హెడ్, వైస్ ప్రసిడెంట్ వీఎస్‌రాం అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మహీంద్రా అండ్ మహీంద్రా ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆయన ప్రారంభించారు. సీఎస్ఆర్ నిధులు రూ.35లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యాలయంలో స్వచ్ఛమైన నీరు, వాష్‌రూంలు, గదులకు పేయింట్ తదితర సౌకర్యాలు కల్పించడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఎస్ రాం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని, వాటికి తోడు సీఎస్ఆర్ పథకం కింద తాము కూడా పలు వసతులను కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదుకోవాలంటే ప్రశాంతమైన వాతావరణం ఉండాలన్నారు. మంచి బోధన చేసేందుకు ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేజీబీవీని ఎంపిక చేసి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. పదిలో మంచి ఫలితాలు సాధించిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మారుతి రాథోడ్, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీకి చెందిన డాక్టర్ వినోద్, ప్రశాంత్, వెంకటరమణ, సూర్యన్, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, కేజీబీవీ ప్రత్యేక అధికారి సంగీత, ఉపాధ్యాయులు నాగమణి, క్రిష్ణవేణి, స్వప్న, కేజా, శారదా, జయశీల, నీలమ్మ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీఎస్ రాం

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

జహీరాబాద్: మండలంలోని గోవింద్‌పూర్, దిడిగి గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం పనులకు గ్రామస్తుల శంకుస్థాపన చేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ. 25 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అక్బర్ హుసేన్, నాయకులు సోమశేఖర్, మల్లారెడ్డి, సురేష్, సామెల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

అక్రమ అరెస్టు సరికాదు

ఆశావర్కర్ల రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు నిర్వహించారు. పలు చోట్ల ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం సరికాదని వాపోయారు. బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



వట్‌పల్లిలో మానవహారం నిర్వహిస్తున్న ఆశాకార్యకర్తలు



న్యాల్‌కల్‌లో నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు



జహీరాబాద్ టౌన్: తహసీల్దార్ కార్యాలయం వద్ద

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చందాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ పరిధిలోని సెక్యూర్ పరిశ్రమ ఎదుట గ్రామస్తులు మంగళవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. స్థానికులకు కాకుండా ఇతర రాష్ట్రాల కార్మికులకు పని కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్థానికులకు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ధర్నాను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

◆ న్యాయవాదిపై దాడి.. నిందితుడి అరెస్టు

జహీరాబాద్: న్యాయవాది ఎజాజ్‌పై దాడిచేసిన నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. వివరాలు ఇలా.. న్యాయవాది ఎజాజ్ ఈనెల 23న దిల్లీ కిరాణాస్టోర్ ముందు రోడ్డు పక్కన తన మోటారు సైకిల్‌పై కూర్చుని అతని క్లైంట్ వసీంతో మాట్లాడుతున్నాడు. సివిల్ కేసులో ప్రతివాది అయిన ఎండీ.గౌస్ ఖురేషి అనే వ్యక్తి అక్కడికి చేరుకుని ఫిర్యాదుదారుడు న్యాయవాదిపై చెంప, చెవిపై కొట్టాడు. అంతే కాకుండా కేసు విత్‌డ్రా చేసుకోకుంటే చంపేస్తానని చంపడానికి ప్రయత్నించాడని న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

◆ రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నారాయణఖేడ్: మనూరు మండలం కమలాపూర్‌లో గురువారం ఉ.11 గంటలకు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నియోజకవర్గ భీమ్ ఆర్మీ అధ్యక్షుడు తుకారాం తెలిపారు. ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీమాత ఆలయం నుంచి కమలాపూర్ గ్రామం వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.